# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 21-03-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

## ముఖ్యాంశాలు

- దేశంలోని అన్ని రాజధానుల్లో శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయాలు నిర్మించేందుకు సంకల్పించామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు.
- రాష్ట్రంలో అటవీ సంపదను విస్తరించడానికి ప్రభుత్వం ప్రణాళికలను సిద్ధం చేసిందని మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు.
- రానున్న నాలుగు నెలల్లో మహా విశాఖ మహానగర పాలక సంస్థ నూతన కార్యాచరణ ప్రణాళికను తయారు చేస్తామని మంత్రి పి. నారాయణ వెల్లడించారు.
- రానున్న 24 గంటలలో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో వర్షాలు కురుస్తాయని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలియజేసింది.

=========================

దేశంలోని అన్ని రాజధానుల్లో శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయాలు నిర్మించాలని సంకల్పించాంమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. తిరుమల పర్యటనలో ఉన్న ఆయన ఈరోజు కుటుంబ సమేతంగా స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం వెంగమాంబ అన్నవితరణ కేంద్రంలో భక్తులకు అన్నప్రసాదం స్వయంగా వడ్డించారు. అనంతరం పాత్రికేయుల సమావేశంలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ... తిరుమల పవిత్రతను కాపాడేందుకు నిరంతరం కృషి చేస్తున్నామన్నారు. తిరుపతిలో ముంతాజ్, ఎమర్, దేవాలోక్ హోటల్స్‌కు కేటాయించిన సుమారు 35 ఎకరాల భూమిని రద్దు చేసినట్లు ముఖ్యమంత్రి తెలుపుతూ..

(వాయిస్ 48 సెకన్లు)

=========================

రాష్ట్ర వ్యాప్తంగా మత్తును కలిగించే ఔషధాల విక్రయాలపై ఈగల్ విభాగం పోలీసులు తనిఖీలు చేపట్టారు. ఆపరేషన్ గరుడలో భాగంగా డీజీపీ ఆదేశాల మేరకు ఈ తనిఖీలు చేపట్టారు. ఈగల్ టీమ్, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్,

పోలీసులు సంయుక్తంగా విజయవాడలోని భవానీపురం, గుణదల ప్రాంతాల్లో తనిఖీలు చేశారు. సైకోటిక్ మెడిసిన్‌ను వైద్యుల ప్రిస్క్రిప్షన్ లేకుండా విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని ఈగల్ విభాగాధిపతి ఆకే రవికృష్ణ హెచ్చరించారు. అలాగే తూర్పుగోదావరి జిల్లాలో 16 చోట్ల తనిఖీలు చేపట్టినట్లు విజిలెన్స్ ఎస్పీ స్నేహిత, డ్రగ్స్ ఏడీ నాగమణి తెలిపారు. వైద్యుల ప్రిస్క్రిప్షన్ లేకుండా మెడికల్ ఏజెన్సీలో, మెడికల్ షాపుల్లో ఇంజెక్షన్లు, మత్తు కలిగించే సిరప్‌లు విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

========================

వాతావరణ కాలుష్యాన్ని నివారించడానికి మొక్కలు పెంచడం ఉత్తమమైన మార్గమని రాష్ట్ర గనులు, భూగర్భ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. మచిలీపట్నంలో జిల్లా అటవీ శాఖ ఆధ్వర్యంలో పచ్చదనం పరిశుభ్రత కార్యక్రమాన్ని మంత్రి ఈరోజు ప్రారంభించారు. దీనిలో భాగంగా 5 కిలోమీటర్ల మేర ప్రధాన రహదారికి ఇరువైపులా 500 మొక్కలను నాటారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ... మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా కాలుష్యాన్ని నివారించడానికి అటవీ సంపదను పెంచవలసిన బాధ్యత ప్రతి ఒక్క పౌరుడిపై ఉందన్నారు. రాష్ట్రంలో అటవీ సంపదను విస్తరించడానికి ప్రభుత్వం ప్రణాళికలను సిద్ధం చేసిందని తెలిపారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఒక మొక్కను నాటి దానిని సంరక్షించాలని, ఇది భవిష్యత్ తరాలకు ఎంతో దోహదపడుతుందని మంత్రి పేర్కొంటూ..

(వాయిస్ 27 సెకన్లు)

========================

దివ్యాంగుల్లో సృజనాత్మకతను వెలికి తీసి వారిని ప్రోత్సహించాలని శ్రీకాకుళం జిల్లా రెవిన్యూ అధికారి ఎం.వెంకటేశ్వర రావు అన్నారు. ఈరోజు స్వాభిమాన్ వినతుల స్వీకరణ కార్యక్రమంలో జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో వివిధ మండలాల దివ్యాంగుల నుండి వినతులను ఆయన స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... దివ్యాంగులకు ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా నిలిచి చేయుతనిస్తుందని అన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుకొని దివ్యాంగులు ఉన్నత లక్ష్యాలను సాధించాలని, వారు ఎందులోనూ తీసిపోరని అన్నారు.

విరామం

========================

రానున్న నాలుగు నెలల్లో మహా విశాఖ మహానగర పాలక సంస్థ (జీవీఎంసీ) నూతన కార్యాచరణ ప్రణాళికను తయారు చేస్తామని రాష్ట్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి. నారాయణ తెలిపారు. విశాఖపట్నం అభివృద్ధి, బృహత్తర ప్రణాళికపై ఈరోజు సచివాలయంలో అధికారులు, విశాఖ శాసన సభ్యులతో మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ... మే నెలాఖరులోగా విశాఖ మెట్రో రైలు టెండర్లు పూర్తి చేయాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. భోగాపురం విమానాశ్రయానికి అనుసంధానంగా రోడ్లు ఏర్పాటు చేస్తామని మంత్రి వివరిస్తూ..

(వాయిస్ 28 సెకన్లు)

========================

రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు గుంతలు లేని రహదారుల అభివృద్ధి పనులను వారోత్సవాలుగా నిర్వహించేందుకు జిల్లా స్థాయిలో సమగ్ర కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి తెలిపారు. అమరావతి నుంచి పల్లె పండుగ పనుల పురోగతిపై ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ నిర్వహించిన దృశ్యామధ్యమం సమావేశంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఈనెల 29వ తేదీ నుంచి గుంతలు లేని రహదారుల అభివృద్ధి పనులు చేపట్టడం లో భాగంగా జిల్లాలో 118.72 కిలో మీటర్ల మేర సీసీ రహదారుల అభివృద్ధిని ఉపాధిహామీ పథకం కింద చేపట్టినట్టు తెలిపారు.

========================

అడవి అందరికి అమ్మ వంటిదని.. అడవులను కాపాడుకొనే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని శ్రీకాకుళం జిల్లా అటవీ శాఖ అధికారి శంబంగి వెంకటేష్ అన్నారు. ప్రపంచ అటవీ దినోత్సవం సందర్భంగా ఈరోజు ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ.. అడవి ఎన్నో జీవులకు ఆధారమని, మానవులకు అవసరమైన ఆహారం.. ఔషధాలతో పాటు ప్రాణవాయువును ఇస్తుందని అన్నారు. శ్రీకాకుళం జిల్లాలో అటవీ ప్రాంతాన్ని పెంచేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టామని తెలిపారు.

========================

వ్యవసాయ రంగంలో విజయనగరం జిల్లా 15 శాతంకు పైగా వృద్ధి రేటు సాధించే దిశగా జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసేందుకు అవసరమైన నిధులను మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరనున్నట్టు కలెక్టర్ డా.బి.ఆర్.అంబేద్కర్ తెలిపారు. ఆయా ప్రాజెక్టుల పనులు, భూసేకరణ, పునరావాసం పూర్తిచేసేందుకు అవసరమయ్యే నిధులకు సంబంధించి అధికారులు తనకు నివేదిక అందజేయాలని ఆదేశించారు. ఈరోజు కలెక్టర్ కార్యాలయంలో అధికారులతో జరిపిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ... తోటపల్లి కుడి ప్రధాన కాల్వ, తారకరామ తీర్థసాగరం ప్రాజెక్టులను పూర్తి చేయడం ద్వారా సుమారు 50 వేల అదనపు ఆయకట్టుకు సాగునీటిని అందించవచ్చు అన్నారు. దీనితోపాటు నగరానికి మంచినీటి సరఫరా, భోగాపురం విమానాశ్రయానికి నీటి సరఫరా చేసేందుకు అవకాశం వున్నందున ఈ ప్రాజెక్టులు త్వరగా పూర్తిచేయాల్సిన అవసరాన్ని త్వరలో జరిగే జిల్లా కలెక్టర్ల సదస్సులో ముఖ్యమంత్రికి వివరిస్తామని తెలిపారు.

========================

రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 25వ తేదీన పాలకొండలో సంకల్ప్ మెగా జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు పార్వతీపురం మన్యం జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి కె. సాయికృష్ణ చైతన్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉపాధి కల్పనలో భాగంగా పదవ తరగతి, ఇంటర్, ఐటిఐ, ఏదైనా డిగ్రీ చదువుకుని 18 నుండి 29 సంవత్సరాల వయసు గల నిరుద్యోగ యువతి, యువకులు ఈ మేళాకు హాజరుకావచ్చని తెలిపారు. ఈ మేళాలో 15 కంపెనీలకు చెందిన ప్రతినిధులు పాల్గొంటారని, ఆసక్తి గల అభ్యర్థులు తమ వివరాలను naipunyam.ap.gov.in వెబ్ సైట్ నందు నమోదు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 63012 75511, 79937 95796 ఫోన్ నెంబర్లకు సంప్రదించవచ్చని ఆయన తెలిపారు.

========================

రానున్న 24 గంటలలో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో వర్షాలు కురుస్తాయని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. ఒడిశా మధ్య ప్రాంతాల నుంచి దక్షిణ విదర్భ వరకు దక్షిణ ఛత్తీస్‌గఢ్ మీదుగా సముద్ర మట్టానికి 0.9 కిలో మీటర్ల ఎత్తులో ద్రోణి విస్తరించి ఉందని, ఈ నేపథ్యంలో రాష్ట్రంలో నైరుతి దిశగా గాలులు వీస్తున్నాయని పేర్కొంది. వీటి ఫలితంగా ఉత్తర కోస్తాలో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు కొన్ని చోట్ల కురిసే అవకాశముందని తెలిపింది. దక్షిణ కోస్తా, రాయలసీమలో తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు ఒకటి లేదా రెండు చోట్ల కురిసే అవకాశముందని వెల్లడించింది.

========================
========================